కుర్రాడు కొంచెం ముందుకే కుర్చీవేశాడు.

"ఇదేంటయ్యా! ఇక్కడ నున్న స్థలం చాలదని నేను ప్రజలను వెనక్కు తోస్తుంటే, మధ్యనొక కుర్చీకూడానా!" అన్నాడు కోపంగా, ఒకనల్లటి, పొడుగాటి యువకుడు, ఆనాటి ఆటకు యజమాని.

"మాయజమానిగారు ఎప్పుడూ ఇక్కడే కూర్చుంటారు. నువ్వే ఇంకా కొంచెం ముందుకుపో!" అన్నాడుకుర్రాడు.

కుర్రాడు పాపయ్యవేపు చూశాడు. పాపయ్య బదులుచెప్పలేదు. కుర్రాడు కుర్చీ కొంచెం వెనక్కుతీస్తే, పాపయ్య బుద్ధిగా వెళ్లికూర్చున్నాడు.

ఆరోజుప్రేక్షకులు హెచ్చుమంది చేరినా, తమాషాలో పాల్గొనేవారు ఎందరో లేరు. ఒక యువకుడు, ఒక కుక్కమాత్రమే .

ఆ యువకుడు తలమీద టోపీ పెట్టుకున్నాడు. ఉంగరాల జుత్తు వెనక్కు తోసుకున్నాడు. చెంపలమీదికి మీసందువ్వుకున్నాడు. ఒక చేతిలోఉన్న వేణువును ఊదుతూ, రెండవ చేతితో డమరు వాయిస్తున్నాడు. వేణువునుండి మంచి హిందీ ట్యూను శ్రావ్యంగా వినవస్తున్నది. ప్రజలందరూ కొంచెం నిశ్శబ్దంవహించిన తరువాత అతను మాట్లాడడం మొదలుపెట్టాడు.

"ప్రజలారా! ఈరోజు చిన్న సర్కస్ ఒకటి ఆడుతున్నాము. దానికి హీరో ఎవరో అనుకోగలరు. వాడు సినీమాహీరో కూడా- వాడు నాప్రిన్స్ చార్మింగ్. నా రాజకుమారుడు- హలో! ప్రిన్స్"

పక్కనే వెనుకకాళ్ల మీద కూర్చున్న కుక్క లేచి తోక ఆడించింది.

"మా రాజకుమారుడికి ప్రొద్దున్న స్నానం చేయించిన తరువాత బట్టలు వేయడం మరచిపోయాను."

సంచిలోనుండి ఒక మాసిన ముఖమల్ కోటును తీసి, కుక్కకు తొడిగి గుండీలు బిగించాడు అతడు.

"నారాజకుమారుడిని సినీమా కంపెనీవాళ్లు కొనుక్కుంటామన్నారు. నేను ఒప్పుకోలేదు. సినీమాల్లో చేరితే చెడిపోతావురా, ఆడవాళ్లవెంట పడతావురా అన్నాను. అవునా, కాదా, ప్రిన్స్?'

ఆ కుక్క అవునన్నట్లు తల ఊపింది. తోక ఆడించింది. సన్నగా మూలిగింది.

"కరెక్టు! అది కుక్క భాషలో చెప్తున్నది. హీరోయిన్లు ముసిలివాళ్లయిపోయారు. చేరను అంటున్నది."

అందరూ నవ్వుతున్నారు.

పాపయ్య ముఖంమీదమాత్రం నవ్వులేదు.

